# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- అమరావతికి 57 కిలోమీటర్ల నూతన రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.
- ఆంధ్రప్రదేశ్ లో 45,300 కోట్ల రూపాయలతో నాలుగు గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణం జరగనుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- గిరిజనులకు లాభదాయక పంటలను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు.
- దానా తుపాను తీరం దాటిన అనంతరం ఉత్తరాంధ్ర తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

==========================

అమరావతికి 57 కిలోమీటర్ల నూతన రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధానమంత్రి అధ్యక్షతన ఈ రోజు న్యూఢిల్లీలో జరిగిన మంత్రి వర్గ సమావేశం అనంతరం అశ్వినీవైష్ణవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ... హైదరాబాద్, కోల్‌కతా, చెన్నై సహా దేశంలోని ప్రధాన మెట్రో నగరాలతో రాజధాని అమరావతిని కలుపుతూ 2,245 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో కొత్త రైల్వే ప్రాజెక్టు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల పొడవైన వంతెన నిర్మాణం చేపట్టనున్నారని అశ్వినీ వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

కాగా అమరావతి రైల్వే లైన్ మంజూరు చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రైల్వే మంత్రిఅశ్వినీ వైష్ణవ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

==============================

ఆంధ్రప్రదేశ్ లో 45,300 కోట్ల రూపాయలతో నాలుగు గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణం జరగనుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. 6 ప్రాజెక్టులు బిడ్డింగ్ దశలో ఉన్నాయని 15 ప్రాజెక్టులు నిలిచిపోయాయని, 75 ప్రాజెక్టులకు భూసేకరణ సమస్యలు, 23 ప్రాజెక్టులకు అటవీ అనుమతుల సమస్యలు ఉన్నాయన్నారు. ఈరోజు ఆయన అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో చేపట్టబోయే ప్రాజెక్టులన్నింటికీ 3 నెలల్లో భూసేకరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నానికి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం జరగనుందన్నారు. ఎకో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని పేర్కొన్నారు. ఆక్వా, హార్టికల్చర్ ఎగుమతులకు రాష్ట్రంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

==============================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 252.42 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద ఆరువరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టనున్నామని దీనికి  కేంద్రప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కేంద్ర రోడ్డు రవాణా రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు.

విరామం

==============================

గంజాయి ప్రత్యామ్నాయంగా లాభదాయ పంటలను సాగు చేసే గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈ రోజు జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి జడ్పీ చైర్పర్సన్ జే.సుభద్ర అధ్యక్షత వహించగా హోం మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఏజెన్సీలో సివిల్ పనులకు పెండింగ్ బిల్లులు ఏమైనా ఉంటే త్వరితగతిన పూర్తి  చేస్తామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో జల్ జీవన్ మిషన్ పనులను వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు.

==============================

పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం అంజనాపురం కాలనీలో వాంతులు, విరేచనాలతో ఇద్దరు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సమీక్ష నిర్వహించారు. అన్ని చోతి బోర్లను మూసివేసి వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలనిమంత్రి అధికారులకు సూచించారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేయడంతోపాటు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. సాధారణ పరిస్థితి వచ్చే వరకు మున్సిపల్, వైద్యారోగ్య శాఖ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు.

==============================

కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, నూతన విధానాలను ప్రజలకు మరింత చేరువయ్యేందుకు గ్రామీణ మీడియా తీసుకోవాల్సిన చర్యలపై ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) గుంటూరులో వార్తాలాప్ కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించింది. ఈ సందర్భంగా పీఐబీ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ అదనపు డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి మాట్లాడుతూ.. 2024 - 25 బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉద్యోగావకాశాలపై ఈ వార్తాలాప్ లో చర్చించామన్నారు. పీఎం ఇన్‌టర్నన్ షిప్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో చేరడానికి మీడియా దోహదం చేస్తుందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

==============================

దానా తుఫాన్ ఉత్తర-వాయువ్య దిశగా కదిలి ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల మధ్య ఉన్న పూరీ, సాగర్ ద్వీపం మధ్య భితార్కానికా, ధమర దగ్గరగా ఈరోజు  అర్ధరాత్రి నుండి రేపు ఉదయం మధ్య తీవ్ర తుఫానుగా తీరం దాటే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. తీరం దాటే సమయములో బలమైన ఈదురు గాలులు గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని హెచ్చరించింది. ఈ సమయంలో రాష్ట్రంలోని ముఖ్యంగా ఉత్తరాంధ్రపై తుఫాన్ ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని వెల్లడించారు. ఇప్పటికే కళింగపట్నం, భీమునిపట్నం, విశాఖపట్నం, గంగవరం పోర్టుల్లో మూడవ ప్రమాద హెచ్చరికలు జారీ చేశామని అన్నారు. తుఫాన్ తీరం దాటిన తర్వాత ఉత్తరాంధ్రలో ఉరుములతో కూడిన వర్షాలు పడతాయని తెలిపారు. అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అన్నారు. ఈ సమయంలో మత్స్యకారులు ఎవరు వేటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

===========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 115వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

===========================

మామిడి రైతులకు అధిక దిగుబడి  వచ్చేలా  మెరుగైన పంట విధానాలపై అవగాహన కల్పించాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులకు సూచించారు. ఈ రోజు  చిత్తూరులో మామిడి పంట సస్య రక్షణ చర్యలపై నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ, మార్కెట్ లో మంచి ధరలు పలకని రకాల మొక్కలకు తలమార్పిడి పద్ధతులను అవలంభించి, అధిక దిగుబడినిచ్చే మొక్కలను అంటుకట్టాలన్నారు.

===========================
===========================